TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:4 TUESDAY ,JUNE 9,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 4 మంగళవారం 9 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-



# తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌తో ఎరువుల అక్రమాలకు అడ్డుకట్ట: మంత్రి తుమ్మల

హంసకలంవార్త జూన్ 8

రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయడం ద్వారా తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర ఫర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటు న్నాయని తెలిపారు. తెలంగాణ నమూనా పై ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు ఇతర రాష్ట్రాలు చర్యలు చేపట్టాయని ఆయన వివరించారు.

- మిగతా2లో

# రూ.1,674.74 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శ్రీకారం..

హంసకలంవార్త జూన్ 8

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లో రూ.1,674.74 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్ల తో మియాపూర్ చౌరస్తా లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308 కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53 కోట్లతో నిర్మించిన బాచు పల్లి ఫ్లైఓవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు.

-మిగతా2లో



# దేశంలో 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు.. హర్దీప్ సింగ్ పురీ

హంసకలంవార్త జూన్ 8

హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని, 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారం

- మిగతా2లో



# 'ఇండియా' కూటమి భేటీలో 15 నిమిషాలు మాట్లాడిన రాహుల్ గాంధీ

- ఢిల్లీలో సమావేశమైన విపక్ష కూటమిలోని పార్టీల నాయకులు
- విభేదాలు పక్కనపెట్టి ఐక్యంగా ఉండాలని రాహుల్ గాంధీ పిలుపు
- ఓటర్ల జాబితాలో అవకతవకలపై సీజేఐకి ఫిర్యాదుకు నిర్ణయం



# ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: మంత్రి పొన్నం

హంసకలంవార్త జూన్ 8

ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన

- మిగతా2లో



# కేసీఆర్ మాట్లాడిన మాటలే సీఎం రేవంత్ మాట్లాడారు.. అందులో తప్పేముంది?: యెన్నం

హంసకలంవార్త జూన్ 8

బీఆర్ఎస్ పార్టీలోని అగ్రనేతల వైఖరిని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మరోసారి ఎండగట్టారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎల్పీ మీడియా హాల్‌లో యెన్నం శ్రీనివాస్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటారు.. మూసీ అభివృద్ధి వద్దంటారని పేర్కొన్నారు. అసలు ఇలాంటి ప్రతిపక్షాన్ని తానెప్పుడూ చూడలేదన్నారు. మీ భవిష్యత్తు మీకూ అర్థమవుతుందా? అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు హరీశ్ రావు,

- మిగతా2లో



# నవభారత నిర్మాణంలో బొగ్గు రంగానిదే కీలక పాత్ర: కిషన్ రెడ్డి

## కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా బొగ్గు ఉండేదన్న కిషన్ రెడ్డి

## రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని వెల్లడి

హంసకలంవార్త జూన్ 8

నవభారత నిర్మాణంలో బొగ్గు రంగం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, గత యూపీఏ ప్రభుత్వం పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

- మిగతా2లో



# రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం.. డిప్యూటీ కలెక్టర్ పై సస్పెన్షన్ వేటు





హంసకలంవార్త జూన్ 8

తెలంగాణ రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ పై సస్పెన్షన్ వేటు పడింది. హౌసింగ్ బోర్డు భూముల పరిశీలన

- మిగతా2లో

# హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదన్న హై కోర్టు



- జగన్ మోహన్ రావు చేతిలో ఓడిపోయిన అమర్‌నాథ్
- రన్నరప్ అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా ప్రకటించిన జస్టిస్ కైత్
- అమర్‌నాథ్ ఎన్నిక నిబంధనలకు విరుద్ధమన్న హైకోర్టు

హంస కలం వార్త HAMSA KALAM VARTA
మంగళవారం 09 జూన్ 2026

## రూ.1,674.74 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శ్రీకారం..

రూ.229 కోట్లతో ఓఆర్‌ఆర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు కోసం ప్రధాన వంతెన నిర్మాణం, ఓఆర్ఆర్ నుంచి కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రూ.110కోట్లతో శంకర్‌పల్లి రోడ్ MGIT నుంచి మణికొండ వరకు పైప్ లైన్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. రూ.29.25కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపం లోని రెండు రైల్వే ఓవర్ హెడ్స్ వరకు నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. రూ.26.50కోట్లతో నానక్‌రామ్‌గూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ వైపు ఉన్న ప్రధాన క్యారేజ్ వే విస్తరణకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికీ భూమిపూజ చేశారు. రూ.14.40 కోట్లతో మాదాపూర్, నానక్‌రామ్‌గూడలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి సీఎం రేవంత్ కొబ్బరికాయ కొట్టారు. అనంతరం మియాపూర్‌లో 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సభకు మంత్రి శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమెల్యేలు అరికెపూడి గాంధీ, మాల్ రెడ్డి రంగారెడ్డి,నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## దేశంలో 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు.. హర్దీప్ సింగ్ పురీ

సోమవారం నాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు, మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు మనకున్నారని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్ని రకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76 నుంచి 80 రోజులకు కూడా సరిపోవచ్చన్నారు.

## ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: మంత్రి పొన్నం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అలాగే పన్నులు చెల్లించని వాహనాలకు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే వాహనాల సీజ్‌కు ఆదేశాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర స్థాయిలో రెండు స్పెషల్ స్క్వాడ్‌ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని తెలిపారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేస్తే.. అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల పన్నులు ఎగ్గొట్టే వాహనాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలకు ఇక పై చెక్ పెడతామన్నారు.

## రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం.. డిప్యూటీ కలెక్టర్ పై సస్పెన్షన్ వేటు

హౌసింగ్ బోర్డు భూముల పరిశీలన సమయంలో రాము నాయక్ చేసిన భారీ అక్రమాలు బయటపడ్డాయి. బహిరంగ మార్కెట్‌లో గజం రూ.2 లక్షలకు పైగా విలువ చేసే హైకోర్టు 5-6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు అధికారులు తేల్చారు.

### ఇందిరమ్మ ఇండ్ల స్థలాల్లోనూ అక్రమాలు

ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలనలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ భూములను కాజేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ దందాలకు పాల్పడిన అధికారులపై ఉక్కుపాదం మోపుతామని, ప్రభుత్వ ఆస్తులను దోచుకునేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రాము నాయిక్‌పై 2016 నుంచే వివిధ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. విజయనగర్ కాలనీ భూ వ్యవహారాలు, తుల్జాగూడ, లక్ష్మీగూడ, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లోని భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై అధికారులు విచారణను ముమ్మరం చేశారు. సబ్ రిజిస్ట్రార్ల పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోంది. అక్రమ సేల్ డీడ్‌లను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూ దందాలకు సహకరించిన ఓ సూపరింటెండెంట్‌ను రెవెన్యూ శాఖ డిస్మిస్ చేసింది. మరో సూపరింటె ండెంట్ బోనా నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. భూకబ్జాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టగా.. తీగ లాగితే డొంక కదిలినట్లు భూ దందాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

## తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌తో ఎరువుల అక్రమాలకు అడ్డుకట్ట: మంత్రి తుమ్మల

తెలంగాణ ఫర్టిలైజర్ యాప్.. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రశంసలు కూడా పొందిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా FSAS ఎరువుల యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా FSAS యాప్ అమలు చేస్తామన్నారు. యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీంతో ఎరువులను మీ సేవా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టెలిఫోన్ ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. రైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు మొబైల్‌లోనే తెలుసుకునే విధంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎరువుల కోసం క్యూ లైన్‌లకు చెక్ పెడుతూ.. రైతులకు సమయానుకూల సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో అక్రమాలకు ఈ ఫర్టిలైజర్ యాప్ అడ్డుకట్ట వేసిందన్నారు. ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిందని చెప్పారు. మిగిలిన యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరాయంగా సమన్వయం చేసుకుంటున్నామన్నారు. అందుకోసం ఢిల్లీలో ప్రత్యేక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. నౌకాశ్రయాల్లోని పోర్టుల నుంచి యూరియా వేగంగా తరలింపునకు ప్రత్యేక అధికారిని కూడా ఏర్పాటు చేశామన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి తుమ్మల వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాజకీయాలు చేయవద్దంటూ ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హితవు పలికారు. రైతులకు మెరుగైన సేవల కోసం సాంకేతిక వినియోగాన్ని విస్తరిస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యాలయం ప్రెస్ నోట్ విడుదల చేసింది.

## 'ఇండియా' కూటమి భేటీలో 15 నిమిషాలు మాట్లాడిన రాహుల్ గాంధీ

బీజేపీ నుంచి ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు మిత్రపక్షాలన్నీ విభేదాలను పక్కనపెట్టి ఏకతాటిపైకి రావాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన 'ఇండియా' కూటమి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఒకరినొకరు విమర్శించు కోవడం మానుకొని, సమైక్యంగా ముందుకు సాగాలని మిత్రపక్షాలకు సూచించారు. సుమారు 15 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్, "కలిసికట్టుగా ఉంటేనే మన మనుగడ సాధ్యం" అని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు, అధికార పక్షాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి సంఘీభావం అత్యవసరమని పేర్కొన్నారు. అయితే, ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలపై కొన్ని మిత్రపక్షాల నుంచి తగిన స్థాయిలో మద్దతు లభించలేదని ఆయన ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుల విషయంలో విపక్షాలు సాధించిన విజయాన్ని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో కూటమిని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ నేతలు మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, వామపక్ష ప్రతినిధులతో సహా మొత్తం 23 పార్టీల నేతలు పాల్గొన్నారు. కాగా, ఈ భేటీకి డీఎంకే గైర్హాజరయ్యింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై భారత ప్రధాన న్యాయమూర్తికి (సీజేఐ) ఫిర్యాదు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి పార్టీల మధ్య నిరంతర సమన్వయం కోసం ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని, తదుపరి భేటీని ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.

# కేసీఆర్ మాట్లాడిన మాటలే సీఎం రేవంత్ మాట్లాడారు.. అందులో తప్పేముంది?: యెన్నం

మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌లను ఆయన సూటిగా ప్రశ్నించారు. అబద్ధాలు ప్రచారం చేసే వారు శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. హరీశ్ రావు శిక్ష అనుభవించక తప్పదని స్పష్టం చేశారు. హెడ్ లైన్స్ కోసం హరీశ్ రావు రాజకీయాలు చేస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. 150 మీటర్లకు తుమ్మిడిహెట్టి నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం దానిని పట్టించుకోలేదని ప్రభుత్వ విప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహారాష్ట్ర గవర్నర్‌గా తెలంగాణ బీజేపీ నేత సీహెచ్ విద్యాసాగర్ రావు ఉన్నారని గుర్తు చేశారు. ఆయన్ని కూడా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపయోగించుకోలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో 600 ఎంజీడీ వాటర్ సప్లై హైదరాబాద్ మహానగరానికి ఉందన్నారు. పదేళ్ళలో ఒక్క ఎంజీడీ వాటర్ కూడా హైదరాబాద్‌కు బీఆర్ఎస్ తీసుకు రాలేదని ఆయన చెప్పారు. పాలమూరు - రంగారెడ్డి కెనాల్ నిర్మాణం చేయకుండా 90 శాతం పనులు పూర్తయ్యాయని బీఆర్ఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తుందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీఆర్‌లో సగం బడ్జెట్ కూడా ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులు చేయడం సాధ్యమా? అని తెలంగాణ ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. భూబకాసురల విషయంలో హైడ్రా.. హిట్లర్ అని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అభివర్ణించారు. హిట్లర్ కంటే కఠినంగా ఉంటామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలో వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఆ సమయంలో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. నాడు కేసీఆర్ మాట్లాడిన మాటలనే సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని స్పష్టం చేశారు. అందులో తప్పేముందంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల పై ప్రశ్నలు సంధిస్తున్న బీఆర్ఎస్ నేతలకు యెన్నం శ్రీనివాస్ రెడ్డి చురకలంటించారు.

## నవభారత నిర్మాణంలో బొగ్గు రంగానిదే కీలక పాత్ర: కిషన్ రెడ్డి

కాంగ్రెస్ హయాంలో 'బొగ్గు' అంటే కేవలం కుంభకోణాలు, అవినీతి, అనిశ్చితికి మాత్రమే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండిపడ్డారు. గత యూపీఏ పాలనలో బొగ్గు శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి జైలుకు కూడా వెళ్లారని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ కాలంలో ఏకంగా రూ. 1.86 లక్షల కోట్ల భారీ బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని, ఆ తర్వాత సుప్రీంకోర్టు సైతం యూపీఏ ప్రభుత్వం కేటాయించిన అన్ని బొగ్గు గనుల కేటాయింపులను రద్దు చేసిందని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా, గత 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో బొగ్గు రంగాన్ని అవినీతి రహితంగా మార్చామని... ప్రస్తుతం దేశంలో బొగ్గు నిల్వలు రికార్డు స్థాయిలో 189 మిలియన్ టన్నులకు చేరుకున్నాయని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రస్తుతం 'అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్' (బొగ్గు వాయువుగా మార్చే ప్రక్రియ) పై చురుగ్గా అధ్యయనం చేస్తోందని మంత్రి వెల్లడించారు. దీనిపై ప్రైవేట్ కంపెనీలతో జూన్ 11న ఒక కీలక సమావేశం జరగనుందని, 2028 నాటికి అన్ని బొగ్గు బ్లాకులను మూసివేయాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. అలాగే క్రిటికల్ మినరల్స్ మిషన్ కింద రూ. 1,500 కోట్లు మంజూరు చేశామని.. ప్రస్తుతం భారతదేశం 24 రకాల కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటోందని, ఇందులో భాగంగానే అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్ బ్లాకులను ప్రభుత్వం దక్కించుకుందని వివరించారు. రాష్ట్రంలో భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే.. సింగరేణి కార్మికులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నును ప్రభుత్వమే స్వయంగా చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో పార్టీ రాజకీయ ఉనికిని బలోపేతం చేయడంతో పాటు.. అభివృద్ధి, సంక్షేమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహంలో భాగంగా కేంద్రమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్ నాథ్ ఎన్నిక చెల్లదన్న హైకోర్టు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ రాజకీయాల్లో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదని స్పష్టం చేస్తూ, అతడిని వెంటనే పదవి నుంచి తొలగించాలని ఆదేశించింది. స్పెషల్ ఏజీఎం నిర్వహించి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. 2023 అక్టోబర్ ఎన్నికల్లో అమర్‌నాథ్ కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో నాటి అధ్యక్షుడు జగన్ మోహన్ రావు చేతిలో ఓడిపోయారు. అయితే, జగన్ మోహన్ రావు సమర్పించిన 'శ్రీ చక్ర క్లబ్' పత్రాలు నకిలీవని, ఆ క్లబ్ ఉనికిలోనే లేదని అమర్‌నాథ్ బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో 2018లోనే జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి ఈ క్లబ్ మార్పు చట్టవిరుద్ధమని తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా, హెచ్‌సీఏ కార్యకలాపాలు ఆగకూడదనే ఉద్దేశంతో రన్నరప్‌గా నిలిచిన అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా జస్టిస్ కైత్ ప్రకటించారు. అయితే, రన్నరప్‌గా ఉన్న వ్యక్తిని అధ్యక్షుడిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. అమర్‌నాథ్ ఎన్నిక నిబంధనలకు విరుద్ధమని తేల్చింది. ఈ తీర్పుతో హెచ్‌సీఏలో మళ్లీ ఎన్నికల వేడి మొదలైంది.

## ఉమ్మడి మహబూబ్‌నగర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పై మంత్రి ఉత్తమ్ సమీక్ష..

హంసకలంవార్త జూన్ 8


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2027 నాటికి ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇందుకు భూసేకరణ, పునరావాస పనులు మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించి పాలమూరు ప్రాజెక్టులపై ఫాస్ట్‌ట్రాక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం జూన్ 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి ఉత్తమ్ అధికారులకు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కీలక దశ డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని ఆజ్ఞాపించారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం పంప్ హౌస్‌లకు తక్షణమే విద్యుత్ కనెక్టివిటీ కల్పించాలన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు కోసం 2,200 ఎకరాల భూసేకరణ ప్రారంభమైందని ఉత్తమ్ తెలిపారు. రాజీవ్ భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల భూసేకరణకు గడువు ఖరారు చేయాలని మంత్రి ఆదేశించారు. నెట్టెంపాడు ప్రాజెక్టుతో అదనంగా 58 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో సౌర విద్యుత్ వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. పనితీరు సరిగా లేని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాలమూరు రైతుల దశ మార్చే ప్రాజెక్టుల పై ప్రభుత్వం ఫుల్ ఫోకస్ పెట్టినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# సంపాదకీయం

## తొంభై ఏళ్ళ తరంగ రథం!

సమాజ హితానికి, మానసిక సుఖానికి అలవరుసలపై అలరించే ఆవిష్కరణ రేడియో. భాషా భావాలు పెనవేసుకున్న మాటల పాటల పేటిక! కంటికి కనిపించని రూపమై, వినిపించే శబ్ద తరంగమై మనతో సాగే అపురూప నేస్తం! రేడియో కేవలం శబ్ద ప్రసార యంత్ర వ్యవస్థ కాదు! అదృశ్య శ్రోతతో మానవ సంబంధాన్ని నిర్మించే ఒక అద్భుత శబ్ద సంస్కృతి! శ్రోతల చెవుల నుంచి ఊహల ఊసులలో ఆడుకునే అందమైన తోరణాలు రేడియో కార్యక్రమాలు. సృజనాత్మక వ్యక్తీకరణ కళను, అంతరంగిక అనుభూతి ఆధ్యాత్మికతను, విజ్ఞానం ప్రసాదించే అవగాహనను, ఈ మూడింటిని ఒకేసారి అందిస్తుంది కనుకనే, ప్రపంచ ప్రజలందరి జీవితాల్లో రేడియో ఒక ముఖ్యమైన భాగం! 1936 జూన్ 8న 'ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్' అనే పేరు 'ఆల్ ఇండియా రేడియో' (ూ×=)గా రూపాంతరం చెంది నేటికి తొంభై ఏళ్ళు! మరో పదేళ్లలో 'శత వసంత సీమకు' పరుగులు పెడుతోంది! టెక్నాలజీ శబ్దాన్ని ఇస్తుంది, కళ భావాన్ని ఇస్తుంది, తత్వం సంబంధాన్ని ఇస్తుంది-- ఈ మూడూ కలిసినప్పుడే నిజమైన 'ప్రసారం' పుడుతుంది! ఆకాశవాణి "అలవరుసలు" అంటే-- శబ్దం, స్వరం, భావం, మౌనం, జ్ఞాపకం, మానవ సంబంధం వీటన్నింటి మధ్య సాగే ఒక నిరంతర అలల క్రమం! అందుకే ఆకాశవాణిలో చివరకు నిలిచేది 'శబ్దం' కాదు, ఒక మనిషి మనకు అత్యంత దగ్గరగా ఉన్నాడనే అపురూప 'అనుభూతి'! ఆకాశవాణిలో వార్తా వ్యాఖ్యానం, ప్రసంగం, ప్రకటన, సంభాషణ, ప్రశ్నోత్తరం, రూపకం, నాటకం... ఇలా ఎన్నో ప్రక్రియలు రసవత్తరంగా సాగుతాయి! ఆ శబ్ద శ్రవణంలోని మాధుర్యం మదినిండా మధుర భావాన్ని నింపుతుంది! శబ్ద రవళుల రసధునియై, భావ సాగరంలో సుశ్రావ్య ధ్వనియై.. ఎప్పుడైనా, ఎక్కడైనా నిరంతరం ఆలకింపజేస్తుంది! ఒక నూతన రాగంగా, తరం తరం పరంపరగా అలరించే ఈ గళ మధురిమ, వినువీధిలో సాగుతూ మన వీనులను స్పృశిస్తుంది! విజ్ఞాన, సాంస్కృతిక, ఆధ్యాత్మిక అంశాలే కాక, ట్రాఫిక్, క్రీడలు, వాతావరణం, వినియోగదారుల సమాచారం.. ఇలా అన్నీ ఒకేచోట లభిస్తాయి! ఇవేగాక సంగీత ప్రసారంలో శాస్త్రీయ, లలిత, జానపద, చలనచిత్ర సంగీతాలు... ఒక్కోదానిదీ ఒక్కో ప్రత్యేక శైలి! మొత్తంగా చూస్తే ప్రతి విషయ సమూహాన్ని తనలో ఇముడ్చుకున్న ఒక అద్భుత 'వైవిధ్య కదంబం' మన రేడియో! 'సమాచారం -- విద్య -- వినోదం' -- ఈ మూడే రేడియో పరమార్థాలు! ఒకే సమయంలో ప్రజలకు ఖచ్చితమైన సమాచారం అందించాలి, జ్ఞానాన్ని పెంపొందిస్తూ విద్యావంతులను చేయాలి, మనసుకు హాయినిచ్చే ఆహ్లాదాన్ని కలిగించాలి! ఈ త్రివిధ బాధ్యతను నిరంతరం నెరవేర్చేదే నిజమైన రేడియో! ఇక్కడ సంగీత ప్రసారానిదీ ఒక ప్రత్యేక స్థానం! శాస్త్రీయ సంగీతం నుండి జానపద గీతాల వరకు, లలిత సంగీతం నుండి చలనచిత్ర గీతాల వరకు రేడియో సంగీతాన్ని కేవలం వినిపించలేదు; తరాల మధ్య ఒక అపురూప 'సాంస్కృతిక స్మృతిగా' నిలిపింది! రేడియోలో 'ఉచ్చారణ, విరామం, మృదుత్వం, ఆహ్వానం' ఇవి కేవలం వాచిక నైపుణ్యాలు మాత్రమే కాదు; అదృశ్య శ్రోతతో ఆత్మీయ బంధాన్ని నిర్మించే అపురూప 'మానవ వంతెనలు'! ఒక వ్యాఖ్యాత స్వరంలో ఉండే ఆప్యాయత, సాన్నిహిత్యం రేడియోను శ్రోతకు అత్యంత దగ్గర చేస్తుంది! శ్రోత ఆ వ్యాఖ్యాత ముఖాన్ని చూడకపోయినా, ఆ స్వరంలోని మానసిక స్థితిని సులువుగా గ్రహిస్తాడు! కొంతకాలానికి ఆ గొంతు జీవితంలోని ఒక జ్ఞాపకంతో, ఒక అనుభూతితో, ఒక సమయంతో కలగలిసిపోతుంది! చివరకు ఆ వ్యాఖ్యాత శ్రోతకు ఒక కుటుంబ సభ్యుడిలా అనిపిస్తాడు! అప్పుడు రేడియో వినికిడి కేవలం వినోదం మాత్రమే కాదు, అదొక అపురూప సాహచర్యం! సమాచారాన్ని మనిషి కేవలం విషయంగా మాత్రమే కాదు, దాన్ని మోసుకొచ్చిన 'స్వరంతో' కూడా స్వీకరిస్తాడు! మాట అనేది ఒక ఆదేశంలా, ఆవేశంతో కాదు, భాగస్వామ్యానికి ఇచ్చే పిలుపులా మృదువుగా ఉండాలి! అది శ్రోతకు కేవలం చదివి వినిపించడం కాదు, శ్రోతతో ఆత్మీయంగా మాట్లాడి, వినేలా చేయడం! మైక్రోఫోన్ ముందు మాట్లాడే వ్యక్తి స్వరం మాత్రమే కాదు, అతని సంస్కారవంతమైన 'వ్యక్తిత్వం' కూడా రేడియోలో ప్రసారమవుతుంది! అందుకే ధ్వని క్రమశిక్షణ, భాషా మర్యాద, సమయస్పృహ, శ్రోత పట్ల గౌరవం వంటి అంశాలు రేడియోలో అత్యంత ముఖ్యమైనవి! అక్షరం రానివారికైనా ఆ స్వరమే భాషై, అక్షరమై తరంగ రథంపై మాటల పాటల రెక్కలు విప్పుకొని, ఒక మధుర భావనగా తేలివస్తుంది! చెవికి గిలిగింతలు పెడుతూ శ్రోతల హృదయాంతరాళంలో చెరిపివేయలేని శబ్ద ముద్రలు వేస్తుంది! శబ్దం నుండి అనుభూతి వరకు, స్వరం నుండి సంబంధం వరకు, అల నుండి జ్ఞాపకం వరకు, రేడియో నుండి మానవ సాన్నిహిత్యం వరకు సాగిన ఒక అపురూప సమాహారం మన ఆకాశవాణి! అల వరుసలపై తేలియాడి మదినిండా మధుర ఊహలను నింపే ఆకాశవాణిని అప్పుడు విన్నాం, ఇప్పుడు వింటున్నాం, ఎప్పుడూ వింటూనే ఉందాం!

# ఆకాశంలో సగానికి అవార్డుల్లో అన్యాయం!





5/63 అంటే ఎంత? శాతాల్లో లెక్కవేసి చూస్తే 7.9 శాతం వస్తోంది. ఇవే గనుక మార్కులు అయివుంటే "మా కడుపున చెడబుట్టావు" కాటగిరీకి చెందుతాయి. ఎన్నికల్లో వచ్చిన ఓట్లు అయివుంటే "డిపాజిట్ కోల్పోయే" లెక్కకి చెందుతాయి. కానీ దురదృష్టవశాత్తూ, ఇది గత 70 ఏళ్ళలో భారతీయ సాహిత్యంలో తలమానికమైన అవార్డుల్లో ఒకటైన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న తెలుగు రచయితల్లో మహిళల సంఖ్య. ఒక రచయితను అంచనా కట్టడానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారమే గీటురాయి కాదనేది వాస్తవమే. కానీ, దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇతర గుర్తింపులు అరుదైన తెలుగు సాహిత్య వాతావరణంలో ఇది చాలా ముఖ్యమైన పురస్కారం. స్త్రీవాద సాహిత్యం, మహిళా చైతన్యం ఉవ్వెత్తున ఎగసి తెలుగు సాహిత్యాన్ని గత శతాబ్దంలోనే సుసంపన్నం చేసినా అకాడమీ గుర్తింపు మాత్రం ఐదంటే ఐదుగురే మహిళలు అందుకోవడం ఏమిటన్నది మనం వేసుకుని తీరాల్సిన ప్రశ్న. కేంద్ర సాహిత్య అకాడమీని 1954లో భారత ప్రభుత్వం స్వయంప్రతిపత్తి కలిగిన జాతీయ సాహిత్య సంస్థగా స్థాపించింది. ఏటా అకాడమీ బడ్జెట్‌లో ప్రధాన భాగం కేంద్ర సాంస్కృతిక శాఖ కేటాయింపుల నుంచి వస్తుంది. రకరకాల పనులు చేసినా సాహిత్యలోకంలో అకాడమీ పేరు తలచుకోగానే పురస్కారాలే గుర్తుకు వస్తాయి. తెలుగు సహా 24 భాషల్లో ప్రతీ ఏటా ఒక 'ఉత్తమ రచన'కు ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. క్రమేపీ ఇతర పురస్కారాలను, గుర్తింపులను (సాహితీ సమ్మాన్, సాహిత్య అకాడమీ ఫెలోషిప్, సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం, బాల సాహిత్య పురస్కారం, యువ సాహిత్య పురస్కారం) ఏర్పరిచి ఏటేటా ఇస్తున్నా, మెయిన్ అవార్డు అని సాహిత్యకారులు పిలుచుకునే ఈ పురస్కారానికి ఉన్న ఆకర్షణ వేరు. 1955 నుంచి గత ఏడు దశాబ్దాలుగా మొత్తం 63 మందికి తెలుగులో ఈ పురస్కారాలు ఇచ్చారు. మొదటి రెండున్నర దశాబ్దాలు మహిళలకు ఒక్క పురస్కారం కూడా దక్కలేదు. 1982లో ఇల్లిందల సరస్వతీదేవి ఈ అవార్డు అందుకున్న తొలి తెలుగు మహిళగా నిలిచారు. దశాబ్దాల పాటు సమాజంలో వచ్చిన మార్పులకు అద్దంపడుతూ ఆవిడ రాసిన వంద కథల సంపుటి 'స్వర్ణకమలాలు'కు ఈ పురస్కారం ప్రకటించారు. మరో దశాబ్దం తర్వాత 1992లో మాలతీ చందూర్‌కు 'హృదయనేత్రి' నవలకుగాను అకాడమీ అవార్డు వచ్చింది. దశాబ్దాలపాటు ఆవిడ పేరు తెలుగునాట ఇంటింటా తెలుసు. 'ప్రమదావనం', 'నన్ను అడగండి', 'పాత కెరటాలు', 'కొత్త కెరటాలు' వంటి శీర్షికలు నిర్వహించడమే కాక నవలలు, కథలు రాశారు. మరో పుష్కరం గడిచాకా 2005లో అబ్బూరి ఛాయాదేవికి 'తన మార్గం' కథా సంకలనానికి పురస్కారం దక్కింది. కథా సాహిత్యంలో స్త్రీవాద దృక్పథాన్ని ప్రభావశీలంగా ఉపయోగించుకున్న ఛాయాదేవిని ఈ పురస్కారం అందుకున్న తొలి తెలుగు స్త్రీవాద రచయితగా గుర్తించవచ్చు. 2013లో 'సాహిత్యాకాశంలో సగం' వ్యాస సంకలనానికి గాను కాత్యాయని విద్మహేకు అకాడమీ అవార్డు లభించింది. తెలుగులో సాహిత్య విమర్శ, పరిశోధనల్లో కృషిచేసిన మహిళకు ఈ పురస్కారం లభించిన ఏకైక సందర్భం ఇదే. 2015లో ప్రముఖ స్త్రీవాద రచయితల్లో ఒకరైన ఓల్గాకు 'విముక్త' కథా సంకలనానికి గాను పురస్కారం లభించింది. కథలు, నవలలు, అనువాదాలు మొదలుకొని బహుముఖాల్లో ఆవిడ సాహిత్యకృషి కొనసాగింది. జాతీయస్థాయిలోనూ ఓల్గా రచనల అనువాదాలకు ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తోంది. 2005--15 మధ్యలో 3 పురస్కారాలు మహిళలకు లభించడంతో పరిస్థితి మెరుగుపడుతోందన్న సూచన కనిపించినా 2016--25 దశాబ్దంలో ఒక్క ఏడాదీ మహిళలు ఎంపిక కాకపోవడం వల్ల పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చినట్టు అయింది. సాహిత్య అకాడమీ తెలుగులో ఇచ్చే ఇతర పురస్కారాల్లోనూ ఈ ధోరణే కనిపిస్తుంది. బాల సాహిత్య పురస్కారానికి 16 మందిలో ఇద్దరు (12.5శాతం), యువ పురస్కారానికి 15 మందిలో ముగ్గురు (20శాతం), అనువాద పురస్కారానికి 36 మందిలో ఏడుగురు (19శాతం) మాత్రమే మహిళా సాహిత్యవేత్తలు ఎంపికయ్యారు. బయటకు కనిపించే గణాంకాలను దాటి కాస్త లోతుగా పరిశీలిస్తే అకాడమీ అవార్డుల ఎంపిక ప్రక్రియలో సైతం మహిళల పట్ల వ్యవస్థీకృత ఉదాసీనతే బయటపడుతోంది. 2018 నుంచి 2025 వరకూ ఎనిమిది సాహిత్య అకాడమీ పురస్కారాల షార్ట్‌లిస్టుల్లో 97 మంది రచయిత పేర్లు పరిగణనకు వస్తే అందులో మహిళలు పేర్లు పదే (8.25 శాతం). ప్రతీ ఏటా ముగ్గురు సాహిత్యవేత్తలను జ్యూరీలో సభ్యులుగా తీసుకుంటారు. షార్ట్‌లిస్ట్ నుంచి ఎవరికి పురస్కారం ఇవ్వాలనేది అకాడమీకి వారే సూచిస్తారు. 2013--2025 మధ్యలో 13 జ్యూరీల్లో 39 మంది సభ్యులు ఉంటే వారిలో నలుగురే (10 శాతం) మహిళలు. పైగా 13 సంవత్సరాల్లో పదేళ్ళు ఒక్క మహిళ కూడా లేకుండా జ్యూరీలు పూర్తిగా పురుషులతో నిండిపోయాయి. తెలుగు సాహిత్య రంగంలో విస్తృతమైన, వైవిధ్యభరితమైన కృషిచేసిన మహిళలకు ఎందరికో ఈ పురస్కారం లభించలేదు. దశాబ్దాల క్రితమే మరణించిన తొలితరం వారి నుంచి హేమాహేమీలైన సమకాలీనుల దాకా ఎందరో అర్హులైన మహిళా రచయితలు ఉన్నా కనీసం కొందరి పేర్లు ప్రస్తావిస్తే ఈ లోటు ఎంత తీవ్రమైనదో, లోతైనదో తెలుస్తుందన్న ఉద్దేశంతో, వారు బాగా ప్రాచుర్యం చెందిన క్యాటగిరీల వారీగా కొన్ని పేర్లు ఇస్తున్నాను: కథలు -- ఆర్. వసుంధరాదేవి, కళ్యాణ సుందరీ జగన్నాథ్, భానుమతీ రామకృష్ణ, పి. సత్యవతి, పొత్తూరి విజయలక్ష్మి, సోమరాజు సుశీల, శివరాజు సుబ్బలక్ష్మి, ఎస్. జయ, నిడదవోలు మాలతి, బొమ్మ హేమాదేవి, గోగు శ్యామల, చాగంటి తులసి, కుప్పిలి పద్మ, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, శీలా సుభద్రాదేవి నవలలు -- బీనాదేవి (ఈ జంట రచయితల్లో భాగవతుల త్రిపుర సుందరమ్మ), తెన్నేటి లత, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, కె. రామలక్ష్మి, యద్దన పూడి సులోచనారాణి, పి. శ్రీదేవి, వాసి రెడ్డి సీతాదేవి, సి. సుజాత, పోలాప్రగడ రాజ్యలక్ష్మి, జలంధర.? కవిత్వం -- జయప్రభ, కొండేపూడి నిర్మల, మహెజబీన్, రేవతీదేవి, ఇంద్రగంటి జానకీబాల, విమల, పాటిబండ్ల రజని, జూపాక సుభద్ర, అయినంపూడి శ్రీలక్ష్మి, అనిశెట్టి రజిత, చల్లపల్లి స్వరూపరాణి, చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ, గీతాంజలి... సాహిత్య విమర్శ, పరిశోధన -- నాయని కృష్ణకుమారి, ముదిగంటి సుజాతారెడ్డి, పి. యశోదారెడ్డి, సి. మృణాళిని, మైథిలీ అబ్బరాజు, జొన్నవాడ రాఘవమ్మ, ముక్తేవి భారతి, రావి ప్రేమలత, కొండపల్లి నీహారిణి, కె. మలయవాసిని వీళ్ళే గాక అర్హులైనవారు ఇంకెందరో ఉన్నారు. ఎంత విలువైన కృషి పురస్కారానికి నోచుకోకుండా ఉండిపోయిందో తెలుసుకోవడానికి ఈ ఉదాహరణలు సరిపోతాయి. అకాడమీ పురస్కారాల నియమ నిబంధనలూ, సాంకేతికాంశాలు అర్హులైన మహిళా రచయితలకు పురస్కారం రాకుండా అడ్డుపడి వుంటుందని భావించడానికైనా వీల్లేనంత విస్తృతంగా ఈ జాబితా ఉంది. తెలుగు సాహిత్యంపై విస్మరించే వీల్లేని ముద్ర వేసిన తొలితరానికి చెందిన సుప్రసిద్ధ మహిళా రచయితల్లో పలువురు మరణించడంతో సాహిత్య అకాడమీ పురస్కారం వారిని అందుకోకుండా ఉండిపోయిందన్న లోటు అలానే ఉండి పోతుంది. పురస్కారం పొందిన రచనలు పలు భారతీయ భాషల్లోకి అకాడమీ అనువదింపజేసి ప్రచురించింది. ఎంతటి విలువైన సాహిత్యాన్ని తోటి భాషల వారు చదివే అవకాశం లేకపోయిందో చూస్తే ఈ పరిణామం వల్ల జరిగిన ఆపర్చునిటీ కాస్ట్ (అవకాశాల నష్టం) తెలుస్తుంది. అయితే, జీవించి ఉన్న దిగ్గజ మహిళా రచయితలకు, యాక్టివ్‌గా రచనలు చేస్తున్న ఇప్పటితరంవారినీ గుర్తించడం ద్వారా ముందడుగు వేయాలి. అయితే, ఇదేదో తెలుగుకే పరిమితమైన సమస్య అనో, సాహిత్య అకాడమీకే పరిమితమైన అంశమనో అనుకోనక్కరలేదు. సూరజ్ జాకోబ్, విమల విశ్వనాథ్ చేసిన పరిశోధన ప్రకారం 2016 నాటికి అన్ని భాషలూ కలిపి 8.1 శాతం సాహిత్య అకాడమీ పురస్కారాలు మాత్రమే మహిళలకు లభించాయి. ఇంగ్లీష్ (25 శాతం), అస్సామీస్ (18 శాతం), సింధీ (13 శాతం), మలయాళం (11 శాతం) వంటి భాషలు కొద్దిగా మెరుగైన స్థితిలో ఉన్నాయి. జ్ఞానపీఠ్ పురస్కారం (13 శాతం) కూడా మహిళల ప్రాతినిధ్యంలో వెనుకబడే ఉండడం ఇది విస్తృతమైన వ్యవస్థాగత లోపం అనే గుర్తుచేస్తుంది. అయితే, సాహిత్య అకాడమీ మెయిన్ అవార్డుల్లో తెలుగు శాతం వీటన్నిటికన్నా కూడా తక్కువగా ఉండడం గమనార్హం. తెలుగు సాహిత్యకారుల్లో అర్హులైన మహిళలు ఈనాటికీ ఎందరో ఉన్నారు కాబట్టి భవిష్యత్తులో అయినా ఈ అనౌచిత్యం సరి అవుతుందనీ, దాని కోసం నియమ నిబంధనల్లోనూ, స్ఫూర్తిలోనూ కూడా తగిన సంస్కరణలు చేస్తారని ఆశిద్దాం.

# తెలుగిళ్ళ శ్రీనాథము

తెలుగువారి అహారపు అలవాట్లలో ఆవకాయ పచ్చడికీ, పెరుగన్నానికీ, మిగతా అన్ని ఆహార పదార్థాలతో పోలిస్తే, ఒక ప్రత్యేక స్థానం ఉంది. అన్నంలోకి కూరలు ఏమీ లేకపోయినా, మొదట్లో రెండు ముద్దలు కలుపుకుని తినడానికి ఒక బద్ద ఆవకాయ కారము, ఆ తరువాత కాస్త పెరుగు కలిపిన అన్నము, పక్కన నంజుకోవడానికి కారం తుడిచేసిన అదే ఆవకాయ బద్ద ఉంటే చాలు ఆ పూట గడిచి పోతుంది అనుకుంటాం. ఇది అతిశయోక్తి కాదు. బాగా ముసురు పట్టి, కూరలు కొనుక్కోవడానికి కాలు బయట పెట్టలేని వానాకాలం రోజులలో, ఒకటి రెండు పూటలు ఇలా గడవడం సాధా రణంగా జరిగే విషయమే. ఈ అలవాటు ఎప్పటిది? అని ఎవరైనా సరదాకైనా ప్రశ్న వేసుకుని అవలోకిస్తే మహాకవి శ్రీనాథుడు నివసించిన (క్రీ.శ.1370-- 1450) 14--15 శతాబ్దుల నాటి కంటే పూర్వపుదే అని సమాధానం దొరుకుతుంది.

పెరుగన్నంలో ఆవకాయ నంజుకుని భుజిస్తుంటే మంట నషాళానికి అంటినప్పుడు కలిగే అనుభవం శ్రీనాథుని 'శృంగార నైషధం' ఆరవ ఆశ్వాసంలోనిదైన ఈ పద్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. తే. మిసిమిగల పుల్ల పెరుగుతో మిళిత మైన ఆవపచ్చళ్ళు చవిచూచిరాదరమున జుబ్బుమని మూర్ధములుద్ధ్ఁకి యెఱ్ఱదనము బొగలు వెడలంగ నాసికాపుటములందు. (శృం.నై. ఆరవ ఆశ్వాసం, 130 పద్యం) తొలినాళ్ళ నుంచీ తెలుగు సాహిత్యం నేల విడిచి సాము చెయ్యడంలో మునిగిపోయిందనే మాట సంగతి అలా ఉంచితే, తెలుగు సాహిత్యాన్ని నింగి నుంచి నేల మీద 'వీధి' లోకి లాక్కొచ్చి దాన్ని సామాన్య ప్రజానీకం మధ్య నిలబెట్టిన ఘనత పూర్వ కవులలో శ్రీనాథుడికి చెందినంతగా మరెవరికీ చెందదు. చాటు పద్యాల రూపంలోనే కాకుండా, అవకాశం చిక్కినప్పుడల్లా కావ్యాలలో సైతం తెలుగువారి జీవన విధానానికి సంబంధించిన అనేక విశేషాలనూ, ఆహారపుటలవాట్లనూ విస్తృత స్థాయిలో పొందుపరిచిన వ్యక్తి, మహాకవి శ్రీనాథుడు. శ్రీనాథుడి కంటే ముందు నన్నయ, తిక్కనలు ఈ పని ఎందుకు చేయలేకపోయారు? అనే ప్రశ్నకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తే, ముందుగా అర్థ చేసుకోవాల్సిన విషయాలు రెండు. ఒకటి -- అసలు తెలుగులో పద్యమైనా, గద్యమైనా శాసనాల్లో తప్ప వేరే ఎక్కడా లిఖితమై లేని ఆ రోజులలో, తనకు అప్పగించబడిన 'మహాభరత ఆంధ్రీకరణం' అనే అతి పెద్ద పనిని బాధ్యతాయుతంగా నిర్వర్తించడంలో మునిగిపోయిన నన్నయ దృష్టి ప్రధానంగా తెలుగులో పద్య నిర్మాణానికి, కావ్య నిర్మాణానికి సంబంధించిన వ్యవస్థను ఏర్పరచడం పైనే తప్ప వేరే విషయాలపై ఉండకపోవడం సహజం. రెండు -- తిక్కన విషయానికొస్తే, ఏ కారణం చేతనో అసం పూర్తిగా ఆగి పోయిన మహాభారత అంధ్రీకరణ యజ్ఞంలో తాను చేపట్టి పూర్తి చేయాల్సిన భాగం కొండంత. కనుక తిక్కన దృష్టంతా



మహాభారత అంధ్రీకరణాన్ని నన్నయ చూపిన దారిలో ముందుకు తీసుకువెళ్ళి పూర్తి చేయడంపైనే తప్ప, వేరే విషయాలపై ఉండే అవకాశం లేదు. శ్రీనాథుని కాలానికి ఈ అవస్థ లేదు. వ్యక్తిత్వ పరంగా ఆలోచిస్తే, శ్రీనాథుడిది ఏ అవస్థనూ ఆట్టే పట్టించుకోని, మనసుకు అంటించుకుని అదే పనిగా మథన పడడానికి ఇచ్చగించని మనస్తత్వం. జీవితాన్ని ఒక ప్రయాణంగా తీసుకుని సంచరిస్తూ కొత్త కొత్త విషయాలను అన్వేషించడంపై శ్రద్ధ చూపిన శ్రీనాథుడు, తన సాహిత్యంలోనూ అదే ధోరణిని కొనసాగించాడు. ఈ ధోరణి ఫలితమే కావ్యాలలో కొద్దోగొప్పో పరిమాణంలో మనకిప్పుడు లభ్యమౌతున్న ఆనాటి ప్రజల గీ. చలి ప్రవేశించు నాగుల చవితినాడు


# తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు ఐక్య విద్యార్థి సంఘాలు

హంస కలం వార్త జూన్ 08 మంచిర్యాల జిల్లా ప్రతినిది లింగంపల్లి మహేష్

జిల్లాలో ఉన్నటువంటి కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో నిలువు దోపిడీ చేయడానికి ఖండిస్తూ జిల్లా కేంద్రంలో ఐక్య విద్యార్థి సంఘాలుగా పాత్రికేయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ. .జిల్లాలోని శ్రీ చైతన్య,నారాయణ, ఆల్ఫోర్స్ లాంటి కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను హింసించడం మరోవైపు అడ్మిషన్ పొందిన విద్యార్థులకు సంబంధించి ఫీజు కన్ఫర్మేషన్ మరియు పుస్తకాల పేరుతో ఫీజుల దోపిడీకి తెరలేపి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయని ఈ విషయాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నిరెత్తనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందని,మరోవైపు కొన్ని కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు విద్యాశాఖ అధికారులు మమ్మల్ని ఏం చేయలేరంటూ బాహాటంగానే చెబుతూ ప్రశ్నించే వారిపై ఎదురుదాడికి దిగుతున్నారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలను వారి పాఠశాల పేర్లతో ముద్రించి విక్రయిస్తూ విద్యాశాఖ నిబంధనలను కాళరాస్తున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని, పుస్తకాల పై అధిక ధరలు ముద్రించి దోచుకుంటున్నాయని, పుస్తకాలను ఆయా పాఠశాలలకు దగ్గరలోని ఏదో ఒక ఇంటిని రెండు నెలల కాలానికి అద్దెకు తీసుకుని బహిరంగంగానే విక్రయిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు



వీడి విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాలుగా ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ జుమ్మిడి గోపాల్, రేగుంట క్రాంతి కుమార్, బచ్చలి అభిరామ్ మరియు శేఖర్ లు పాల్గొన్నారు.







# ప్రజా సమస్యలకు ప్రజా పాలన వేదిక

-వార్డు సభతో ప్రజా సమస్యలపై ఫోకస్..
-రోడ్లు, డ్రైనేజీల పరిష్కారానికి హామీ..
-వివేక్ దృష్టికి ప్రతి వినతి..
-14, 17వ వార్డుల ప్రజల భారీ స్పందన..

హంస కలం వార్త జూన్ 8 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మందమర్రి పట్టణంలోని మార్కెట్ కట్ట దుకాణాల ప్రాంగణంలో 14వ, 17వ వార్డుల సంయుక్త వార్డు సభ విజయవంతంగా నిర్వహించారు. చెన్నూరు శాసనసభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సభకు పట్టణ అధ్యక్షుడు మంద



తిరుమల్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధిలో భాగంగా రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, పింఛన్లు తదితర సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ గడ్డం



వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, వార్డు సభలో వచ్చిన ప్రతి సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కా రానికి కృషి చేస్తామని తెలిపారు.. ఈకార్యక్రమంలో నెరువట్ల శ్రీనివాస్, ఎండి ఇషాక్, రాయబారపు కిరణ్, బియ్యపు రవి కిరణ్, బత్తుల సతీష్, గట్ల సారంగపాణి, కనకం రాజు, విద్యాసాగర్ సాయికిరణ్, ప్రదీప్, ప్రజలు, వార్డు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు..

# వరి నిల్వలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

-ధాన్యం నిల్వల భద్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలి
-జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
-ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియపై ఆకస్మిక తనిఖీ



హంసకలంవార్త జూన్ 8

మండలంలోని చందుబట్ల గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ సోమవారం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం నిల్వలు, వాటి భద్రత, నిర్వహణ విధానాలను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సందర్భంగా రైస్ మిల్లులో నిల్వ చేసిన వరి ధాన్యం వివరాలను సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ధాన్యం నిల్వ చేసే గోదాముల సామర్థ్యం, తేమ శాతం, నాణ్యత పరిరక్షణ చర్యలు, రవాణా ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలపై అధికారులు ఆరా తీశారు. ల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యానికి ఎలాంటి నష్టం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నిల్వల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, రైతుల శ్రమకు తగిన విలువ దక్కేలా ధాన్యం నాణ్యతను కాపాడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు మరియు ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల నుంచి ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసి, రైతులు ఎక్కువసేపు నిరీక్షించాల్సిన పరిస్థితులు తలెత్తకుండా చూడాలని సూచించారు.అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలని, ఎలాంటి ఆలస్యం లేకుండా డేటా నమోదు ప్రక్రియను సకాలంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు అందిస్తూ, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అలాగే నిల్వల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ధాన్యం నిల్వ కేంద్రాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ,...... ధాన్యం నిల్వ కేంద్రాలు, గోదాముల వద్ద భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిల్వల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, రైతుల కష్టార్జిత పంట భద్రంగా నిల్వ ఉండేలా అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ తనిఖీలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, డి ఎం సివిల్ సప్లై రాజేందర్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లు ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దెబ్బకు అక్రమాలకు చెక్

- ఫిర్యాదుకు 24 గంటల్లోనే ఫలితం..
-అక్రమ లేఅవుట్ హద్దురాళ్ల తొలగింపు..
-రాకేష్ రేగుంట, నవీన్ వర్మ ఫిర్యాదుపై చర్యలు..
-కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాలతో యంత్రాంగం పరుగులు..

హంస కలం వార్త జూన్ 8 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించి అక్రమ లేఅవుట్‌పై చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ధర్మ సమాజ్ పార్టీ నాయకులు రాకేష్ రేగుంట, నవీన్ వర్మ ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రంపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదు అందిన కొద్ది గంటల్లోనే జైపూర్ మండల అధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టడం విశేషం. జైపూర్ మండలం ఇందారం గ్రామ పరిధిలోని నజీర్‌పల్లె సర్వే నంబర్ 50లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్ ఏర్పాటు చేసి హద్దురాళ్లు పాతినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జైపూర్ మండల అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ఇందారం గ్రామ పంచాయతీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించారు.దఇందారం ప్రాంతంలో ఏర్పాటైన అక్రమ లేఅవుట్ కారణంగా బొగ్గు గని ప్రాజెక్టు ప్రాంతం నుంచి వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులకు మట్టి తరలింపులో తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని రాకేష్ రేగుంట తెలిపారు. అధిక లోడుతో వెళ్తున్న లారీలు భద్రతా ప్రమాణాలు పాటించకుండా కవర్లు లేకుండా వేగంగా సంచరిస్తుండటంతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారులపై దుమ్ము, మట్టి పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి చర్యలు చేపట్టడం ప్రజాపాలనలో బాధ్యతాయుత వైఖరికి నిదర్శనమని రాకేష్ రేగుంట, నవీన్ వర్మ అభిప్రాయపడ్డారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ మండల



అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఇందారం గ్రామ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బందికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఇదే తరహా వేగవంతమైన స్పందన కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ లేఅవుట్లపై మరింత కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములు, ప్రజా ప్రయోజనాలను పరిరక్షించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# శీనన్న వచ్చాకే దశాబ్దాల అభివృద్ధి సాధ్యమైంది

-పొన్నేకల్‌కు దక్కిన ప్రాధాన్యతను గుర్తించే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నాం..
-ఇందిరమ్మ ఇళ్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్ణయాలే మమ్మల్ని కదిలించాయి..
-వివిధ పార్టీల నుంచి తరలివచ్చి.. స్వచ్ఛందంగా చేరిన వారి స్పష్టీకరణ..
-తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకున్న 50 కుటుంబాలు..

హంసకలంవార్త జూన్ 8

దశాబ్దాలుగా మా ప్రాంతంలో జరగని అభివృద్ధి.. మంత్రి పొంగులేటి శీనన్న వచ్చిన తర్వాతే కళ్లముందు సాక్షాత్కరిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు ప్రాధాన్యత ఇవ్వడం, మా పొన్నేకల్ గ్రామంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' నిర్మిస్తుండటమే ఇందుకు నిదర్శనం. మా గ్రామానికి, మా ప్రాంతానికి మంత్రి పొంగులేటి ఇస్తున్న ఈ ప్రత్యేక ప్రాధాన్యతను గుర్తించే మేమంతా కాంగ్రెస్ బాట పట్టామని పార్టీలో చేరిన పలువురు నేతలు పేర్కొన్నారు. సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయం వేదికగా ఖమ్మం రూరల్ మండలంలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్, సీపీఎం సహా వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమానికి, పొంగులేటి అభివృద్ధి మంత్రానికి ఆకర్షితులై పార్టీలో చేరారు. క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వీరందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పొన్నేకల్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో

-ఈ చేరికల ప్రక్రియ విజయవంతంగా సాగింది.

తరలివచ్చిన కుటుంబాలు.. కాంగ్రెస్ గూటికి చేరిన వారిలో రాయల సైదులు, మారపొంగు నరేష్, సిరిపల్లి లక్ష్మయ్య, గార్లపాటి ఉపేందర్, వరగాని ఉపేందర్ కుటుంబాలతో పాటు సుమారు 50 కుటుంబాల వారు ఉన్నారు. దశాబ్దాల వెనుకబాటుకు పొంగులేటి చొరవతోనే మోక్షం లభిస్తుందని నమ్మి, తమ గ్రామాభివృద్ధి కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు



వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, కళ్ళెం వెంకట్ రెడ్డి, మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, ముత్యం చిన్ని కృష్ణారావు, ఖమ్మం రూరల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోటి రమణ, పొన్నేకల్ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగూరి రవి, లింగా శ్రీనివాస్, గునిగంటి రమేష్, తేళ్లపూడి శ్రీనివాస్, వరగాని శ్రీనివాస్, కోట వెంకటేశ్వర్లు, పొన్నేకంటి ఉపేందర్, పెద్దపొంగు ఉపేందర్, మోరు రమేష్, మురకొండ వెంకటేశ్వర్లు, వరగాని నాగేశ్వరరావు, బొడ్డు హనుమంతు, కొత్తా గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త HAMSA KALAM VARTA


# ప్రత్యేక సభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



హంసకలంవార్త జూన్ 8

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు,ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31,32 డివిజన్లకు సంబంధించి లక్ష్మీ గార్డెన్స్ లో నిర్వహించిన డివిజన్ సభకు డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి చంద్రయ్య,మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, 31వ డివిజన్ కార్పొరేటర్ సంపత్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక గ్రామ/డివిజన్/వార్డు సభలు నిర్వహించి,పారిశుధ్యం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ,అరైవ్-అలైవ్, ఇందిరమ్మ ఇండ్లు, సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, తడి చెత్త,పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వేరువేరుగా సేకరించి నిర్వీర్యం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని,వర్షం వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ కాకుండా ఉంటుందని తెలిపారు.ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాల అందజేత, స్వీకరణ, చనిపోయిన, డబుల్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని,ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్- అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని,గత సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు.10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకం కూడా అందించడం జరుగుతుందని, జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.వైద్యం,విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసిల్దార్ల దృష్టికి తీసుకురావచ్చుని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు. డిసిపి మాట్లాడుతూ... ప్రజలందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించడం,హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,బాలికల సంరక్షణ కొరకు షీ టీం సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని, తెలిసిన వాళ్ళు ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగించినట్లు సమాచారం ఇస్తే వారిని డి-అడిక్షన్ సెంటర్ కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఏదైనా ఇబ్బందులు తలెత్తితే 100 నెంబర్ కు డయల్ చేసి వెంటనే సమాచారం అందించడం ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ మాట్లాడుతూ "మంచిర్యాల శుభ్రత- ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత" నినాదంతో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, వీధి దీపాలు, రోడ్ల మరమ్మత్తులు, త్రాగునీటి సదుపాయం, మురుగు కాలువల నిర్వహణ,తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజాపాలన ద్వారా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని,ఎలాంటి అవినీతి,దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా పనులు చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల సంబంధిత ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ,ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

**-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**
**-రూ.97 లక్షల సుడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**
**-రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనం ప్రారంభం..**
**-రఘునాథపాలెం మండలం వి.వి. పాలెంలో పర్యటించిన మంత్రి తుమ్మల..**





హంసకలంవార్త జూన్ 8

రఘునాథపాలెం;-భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అత్యుత్తమ నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం వి.వి.పాలెం గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి రూ.97 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వి.వి.పాలెం గ్రామంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని తెలిపారు. 1982లో దివంగత ఎన్టీఆర్‌తో కలిసి తొలిసారిగా ఈ గ్రామానికి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ కాలంలో ఎత్తిపోతల పనులు చేపట్టామని, అనంతరం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. జిల్లా పశు వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించినట్లు చెప్పారు. పేదల్లో అత్యంత పేదలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ మండల ఉపకేంద్ర స్థాయి లో పశు వైద్యశాల భవనం వి.వి.పాలెంలో నిర్మించడం ఈ ప్రాంత ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పశు సంపద రైతులకు ఆర్థిక బలాన్ని అందిస్తుందని, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ భవనం పూర్తి స్థాయిలో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా పశు వైద్యశాలకు పరిసర ఐదు, ఆరు జిల్లాల్లో మంచి గుర్తింపు ఉందని, కొన్ని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు అవసరమని తెలిపారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు భూమి వినియోగం సమర్థవంతంగా ఉండాలని సూచించారు. పాఠశాలల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాల్లో లేదా వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను మరమ్మతులు చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్వేత, సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ గుగులోతు ప్రవీణ్ నాయక్, ఆత్మ చైర్మన్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**-పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**




హంసకలంవార్త జూన్ 8

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అదేశించారు.కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్ తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 104 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



హంసకలంవార్త జూన్ 8

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన,సమగ్ర రూపాంతరం కేవలం ప్రజా భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నార్నూర్ మండలం కొత్తపల్లి (హెచ్)గ్రామంలోని నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గ్రామసభలో గ్రామస్తుల నుంచి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి తక్షణమే నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం,తాగునీరు, అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని వ్యవసాయం వర్షపాతంపైనే ఆధారపడి ఉన్నందున ,రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని సూచించారు.ఆగస్టు 15 నాటికి ఆశించిన వర్షాలు పడకపోతే పెసర్లు, కందులు,మినుములు, సోయాబీన్ వంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. ముందస్తు విత్తనాలు వేసి నష్టపోవద్దని,పదును పడ్డాకే విత్తాలని వ్యవసాయ అధికారుల సలహాలను గుర్తు చేశారు.అలాగే తక్కువ ధరకే అమ్మే నకిలీ విత్తనాలను నమ్మి మోసపోవద్దని,కేవలం ప్రభుత్వ గుర్తింపు పొందిన లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే కొనుగోలు చేసి రసీదులు భద్రపరుచుకోవాలని హెచ్చరించారు.నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై సమాచారం ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ టాయిలెట్లను, పుల్లబాయి-దేవిదాస్ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహ గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో పుల్లారావు, సర్పంచ్ చవాన్ దిగంబర్,స్థానిక ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

# నాన్నా..నన్ను చూడకుండానే వెళ్లిపోయా ఎందుకు

హంసకలంవార్త జూన్ 8

మంచిర్యాల జిల్లాలోని జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన గజ్జెల భూపతి(31) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఆదివారం మృతి చెందాడు.జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.గజ్జెల మల్లేశ్-సత్యవతి దంపతుల కుమారుడు భూపతి.గతేడాది మే 21న అదే గ్రామానికి చెందిన మేన మరదలు శ్వేతతో వివాహం చేశారు.ప్రస్తుతం శ్వేత 9 నెలల గర్భిణి.ఈ నెల 10న ప్రసవానికి వైద్యులు సమయమిచ్చారు. వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లిన భూపతి బహిర్భూమికి వెళు తున్నట్లుగా అతని వెంట పొలంలో ఉన్న వ్యక్తికి చెప్పి వెళ్లాడు.ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో ఆ వ్యక్తి భూపతి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సుమారు రెండు గంటల పాటు వెతికినా ఫలితం లేకుండా పోయింది. చివరకు వ్యవసాయ బావుల్లో వెతకడంతో ఓ బావిలోని నీళ్లపై చెప్పులు తేలియాడుతూ కనిపించాయి.గ్రామానికి చెందిన గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు.భూపతి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రావు కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై పేర్కొన్నారు.

**-శ్వేత కడుపులోని చిన్నారి ఆవేదనకు అక్షర రూపమే ఇదీ**

గజ్జెల భూపతి మృతదేహాన్ని శవ పంచనామా కోసం జీపులో ఎక్కిస్తుండగా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.నిండు గర్భిణిగా ఉన్న భార్య శ్వేత అక్కడికి చేరుకొని బావ నీవు లేకుండా నేను బతకలేను అంటూ విలపించిన తీరు ప్రతి ఒక్కరిని కంట తడి పెట్టించింది.తల్లి సత్యవతి స్పృహ కోల్పోయింది. నేనూ కొడుకుతో పాటే వెళ్లిపోతానని వెక్కివెక్కి ఏడ్చింది. మృతి చెందిన భూపతికి ఈత రాదు. కనీసం ద్విచక్రవాహనం సైతం నడపలేదు. ఏడాది కిందట అమ్మను పెళ్లి



చేసుకున్నావు, మరో మూడు రోజులో నన్ను ముద్దాడా లనుకున్నావు మరెందుకు నాన్న మా అందరిని వదిలి పెట్టి ఎవరికీ అందనంత దూరాలకు ఆ విధి నిన్ను తీసుకెళ్లింది లోకం పోకడ తెలియని నాకు సమాధానం కావాలి నాన్న.సమాధానం కావాలి.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో మౌళిక సదుపాయాలు

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**-విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన కార్యాలయం ఉపయోగపడుతుంది..**

**-కూసుమంచి మండల కేంద్రంలో ఈఆర్వో కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి..**



హంసకలంవార్త జూన్ 8

ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి మండల కేంద్రంలో రూ. 35 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన విద్యుత్ రెవెన్యూ కార్యాలయ భవనాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో మౌళిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రతి వినియోగదారునికి అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నూతనంగా నిర్మించిన ఈఆర్వో కార్యా లయం ద్వారా విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని, విద్యుత్‌కు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను త్వరితగతిన పరిష్కరిం చేందుకు ఈ కార్యాలయం దోహదప డుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, సంబంధిత శాఖల అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి

హంసకలంవార్త జూన్ 8

ప్రజల భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కలెక్టర్ ప్రత్యేక చొరవతో సోమవారం నగరంలోని 41వ డివిజన్ వసంత్ నగర్ లో శ్రమదానం నిర్వహించారు. కలెక్టర్ తో పాటు నగర మేయర్ కూరగాయల ఉమారాణి, డిప్యూటి మేయర్ సల్మా తహ సీన్, కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు స్థానికులతో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాన్ని శ్రమదానంతో శు భ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో శ్రమదానం అంశం లేనప్పటికీ, పరిసరాల పరిశు భ్రతలో ప్రజలను భాగస్వాములు చేయాలనే లక్ష్యంతో నిజామాబాద్ నగరంలో ప్రత్యేకంగా శ్రమదానం కారక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక



దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ఖాళీ స్థలాలు కబ్జాకు గురి కాకుండా కాపాడుకోవాలని, తద్వారా ఆ స్థలాలను స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్కులు, వాకింగ్ ట్రాక్ తదితర వాటి కోసం వినియోగించుకునేలా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ప్రస్తుతం శ్రమదానం చేసిన సుమారు 10 వేల చదరపు గజాల మున్సిపల్ స్థలాన్ని పరిరక్షించేందుకు సరిహద్దులను గుర్తిస్తూ బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఆహ్లాదాన్ని అందించేలా పూల మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పూజిత, స్థానిక ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

హంసకలంవార్త జూన్ 8

ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 16 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును న్యాయ బద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబ ంధిత అధికారులను ఆదేశిం చారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్క రించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడా లని స్పష్టం చేశారు.



ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ప్రజా సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి వినతులను స్వీకరించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి తక్షణ స్పందన అందిస్తున్నామని పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**-రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**-నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం బిల్లులు విడుదల..**

**-రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు..**

**-కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి**



హంసకలంవార్త జూన్ 8

కూసుమంచి:- ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. కేవలం ఇళ్ల మంజూరుతోనే బాధ్యత ముగిసిపోయిందని భావించకుండా నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తున్నామని తెలిపారు. రాజుపేట గ్రామంలో వన్నాపురం సుభద్ర, దాసరి భద్రయ్య, కోట వీరారెడ్డి, సంద్ర ఎల్లమ్మ, గట్టు సింగారం గ్రామంలో గుంటి దుర్గా, గుడిపల్లి వెంకట నరసమ్మ, దివ్వల రమేష్, గుడిపల్లి జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. రాజుపేట గ్రామంలో మంజూరైన గృహాల్లో నాలుగు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని, గట్టు సింగారం గ్రామంలో 19 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 10 ఇళ్లు పూర్తై గృహ ప్రవేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ఈ లక్ష్యంతోనే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామని వెల్లడించారు. అర్హులైన చివరి లబ్ధిదారుడికి కూడా ఇందిరమ్మ ఇల్లు అందే వరకు దశల వారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. నూతనంగా ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన కుటుంబాలకు మంత్రి శు భాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇంట్లో సుఖ సంతోషాలతో, ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



హంసకలంవార్త జూన్ 8

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి,తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య,వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు,భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పి ంచారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు

# ఆఫ్ఘనిస్తాన్‌ను దెబ్బతీసిన ఇండియన్ స్పిన్నర్లు

### - ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో భారీ విజయం





ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఇండియా ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 112 రన్స్‌కే ఆఫ్ఘనిస్తాన్ ఆలౌటైంది. భారత స్పిన్నర్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసుకోగా, రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ 3 వికెట్లు తీసుకున్నారు. భారత్‌తో జరిగిన ఏకైక టెస్టులో ఆఫ్ఘనిస్తాన్ చిత్తుగా ఓడింది. న్యూ చండీఘడ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో భారత్ భారీ విక్టరీ సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ కేవలం 112 పరుగులకే ఆలౌటైంది. ఇవాళ మూడవ రోజు 14 వికెట్లు పడ్డాయి. ఇండియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 564 రన్స్ చేయగా, ఆఫ్ఘనిస్తాన్ తన తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 152 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్ మానవ్ సుతార్ ఆరు వికెట్లు తీసి ఆఫ్ఘన్ బ్యాటర్లను దెబ్బతీశాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఫాలోఆన్ ఆడిన ఆఫ్ఘనీలు మరీ దారుణంగా చేతులెత్తేశారు. టాపార్డర్ బ్యాటర్ల దాదాపు విఫలం అయ్యారు. ఓపెనర్ అటల్ 42, గుర్బాజ్ 24 రన్స్ చేశారు. 412 పరుగులు వెనకబడి ఫాలోఆన్ ఆడిన ఆఫ్ఘనిస్తాన్ ఎక్కడ కూడా నిలదొక్కుకునే ప్రయత్నం చేయలేదు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. ఆఫ్ఘనిస్తాన్ కేవలం 35.3 ఓవర్లలో తన రెండో ఇన్నింగ్స్‌లో 112 రన్స్ చేసి ఆలౌటైంది. మూడో రోజు వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ మూడు వికెట్లు తీసుకున్నారు.

# మెదక్‌కు తిలక్ -వరంగల్‌కు సిరాజ్




టీజీ20 లీగ్ వేలంలో రూ. 33 లక్షలతో తిలక్ టాప్. మిలింద్‌కు 17 లక్షలు. సిరాజ్‌కు 14 లక్షలు టీమిండియా స్టార్ క్రికెటర్లు తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్ తెలంగాణ టీ20 క్రికెట్ లీగ్ (టీజీ 20)లో తమ బ్యాట్, బాల్ పవర్ చూపేందుకు సిద్ధం అవుతున్నారు. రాష్ట్రంలోని క్రికెటర్లకు ఐపీఎల్ తరహా వేదిక అందించేందుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఈ నెల 21 నుంచి నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక లీగ్ తొలి ఎడిషన్ కోసం ఆదివారం నిర్వహించిన ఆటగాళ్ల వేలంలో తిలక్ అత్యధిక రేటు పలికాడు. ఐకాన్ కేటగిరీలోని టాప్ ప్లేయర్ల కోసం 8 ఫ్రాంచైజీలు పోటీ పడగా.. రూ. 33 లక్షల రికార్డు ధరకు తిలక్‌ను మెదక్ ఫాల్కన్స్ సొంతం చేసుకుంది. స్టార్ పేసర్ సిరాజ్‌ను రూ.14 లక్షలకు వరంగల్ వారియర్స్ కైవసంచేసుకుంది.తెలంగాణ ప్రభుత్వ అప్పులు అన్‌క్యాప్డ్ ప్లేయర్ల విభాగంలో లెఫ్మార్మ్ పేసర్ సీవీ మిలింద్‌కు భారీ డిమాండ్ ఏర్పడగా టీమిండియా స్టార్ క్రికెటర్లు తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్ తెలంగాణ టీ20 క్రికెట్ లీగ్ (టీజీ 20)లో తమ బ్యాట్, బాల్ పవర్ చూపేందుకు సిద్ధం అవుతున్నారు. అతడిని రూ 17 లక్షల అత్యధిక ధరకు ఖమ్మం ఏసెస్ జట్టు కొనుగోలు చేసింది. ఇతర ఐకాన్ ప్లేయర్లలోరవి కిరణ్ (పాలమూరు), టి. రవితేజ (మెదక్ ), తనయ్ త్యాగరాజన్ (రంగారెడ్డి రైజర్స్), రాహుల్ బుద్ధి (నల్గొండ నైట్స్), తన్మయ్ అగర్వాల్ (కరీంనగర్ డైమండ్స్), రోహిత్ రాయుడు (పాలమూరు) కూడా మంచి రేటు దక్కించుకున్నారు. ఏ -కేటగిరిలో అర్ఫాజ్ అహ్మద్, అభిరత్ రెడ్డి చెరో రూ.11 లక్షల ధర పలికారు. వేలం కోసం ప్రతీ ఫ్రాంచైజీకి కేటాయించిన రూ. 60 లక్షల పర్స్ కేటాయించారు. అన్ని ఫ్రాంచైజీలు మొత్తం రూ.4.74 కోట్లు ఖర్చు చేసి 160 మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి.

# తిలక్ వర్మకు రూ.33 లక్షలు



క్రికెటర్లపై కాసుల వర్షం కురిపించిన టీజీ20 ఆటగాళ్ల వేలం హైదరాబాద్ క్రికెట్‌లో సరికొత్త అంకం. టీజీ20 ఆటగాళ్ల వేలంలో ఫ్రాంఛైజీలు క్రికెటర్లపై కాసుల వర్షం కురిపించాయి. దిగ్గజ క్రికెటర్లలో తిలక్ వర్మ రూ.33 లక్షలు (మెదక్ ఫాల్కన్స్) దక్కించుకోగా.. పేసర్ మహ్మద్ సిరాజ్ రూ.14 లక్షలు (వరంగల్ వారియర్స్), సివీ మిలింద్ రూ.17 లక్షలు ( ఖమ్మం ఏసెస్) వేలంలో అత్యధిక ధర సొంతం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రామోజి ఫిల్మ్‌సిటీలో ఆదివారం జరిగిన ఆటగాళ్ల వేలంలో 1300 మంది క్రికెటర్లు అదృష్టం పరీక్షించుకోగా.. 8 ఫ్రాంఛైజీలు 160 మంది క్రికెటర్లను కొనుగోలు చేశాయి. హెచ్‌సీఏ తరపున రాష్ట్ర జట్లకు ప్రాతినిథ్యం వహించిన క్రికెటర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచిన ఫ్రాంఛైజీలు.. ఆ తర్వాత లీగ్ దశలో, జిల్లాల తరఫున ప్రాతినిథ్యం వహించిన క్రికెటర్లను తీసుకునేందుకు ఆసక్తి చూపించాయి. అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో అత్యధిక ధర దక్కించుకున్న క్రికెటర్‌గా సీవీ మిలింద్ నిలిచాడు. దినవతెలంగాణ-హైదరాబాద్‌గ్గజ ప్లేయర్ల జాబితా నుంచి మాజేటి రవి కిరణ్ రూ.13 లక్షలు (పాలమూరు స్ట్రయికర్స్), టి రవిజేత రూ.12 లక్షలు (మెదక్ ఫాల్కన్స్), తనయ్ త్యాగరాజన్ రూ. 11 లక్షలు (రంగారెడ్డి రైజర్స్), రాహుల్ బుద్ధి రూ. 8 లక్షలు (నల్గొండ నైట్స్), తన్మయ్ అగర్వాల్ రూ.8 లక్షలు (కరీంనగర్ డైమండ్స్), కొలగాని రోహిత్ రాయుడు రూ.6.5 లక్షలు (పాలమూరు స్ట్రయికర్స్) వేలంలో మంచి ధర దక్కించుకున్నారు. ఏ ప్లస్ విభాగంలో ఆమన్ రావు రూ.12 లక్షలు (వరంగల్ వారియర్స్), ఎం. సాయి ప్రజ్ఞయ్ రెడ్డి రూ.11 లక్షలు (పాలమూరు స్ట్రయికర్స్), గంగపురం అజయ్ దేవ్ గౌడ్ రూ.11 లక్షలు (హైదరాబాద్ ఈ చాంపియన్స్), నోముల నితిన్ సాయి యాదవ్ రూ.9 లక్షలు (రంగారెడ్డి రైజర్స్), ఆరోన్ జార్జ్ రూ.7.5 లక్షలు (రంగారెడ్డి రైజర్స్), రక్షణ్ రెడ్డి రూ.6 లక్షలు (నల్గొండ నైట్స్)లు వేలంలో ఫ్రాంఛైజీలను ఆకర్షించారు. ఏ కేటగిరీ నుంచి అభిరాత్ రెడ్డి రూ. 11 లక్షల ధరకు హైదరాబాద్ ఈ చాంపియన్స్ సొంతమవగా.. అర్ఫాజ్ అహ్మద్ సైతం రూ. 11 లక్షలకు నల్గొండ నైట్స్ గూటికి చేరాడు.

## బిజినెస్


# పశ్చిమాసియా యుద్ధం

### - పెరిగిన నిత్యావసర ధరలతో భారతీయుల ఇక్కట్లు



ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటికే అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. ఇండియాలో వరుసగా ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. అసలు ఎల్పీజీ సిలిండర్లు దొరకడమే కష్టమైపోయింది. ఇదంతా ఇప్పుడు సామాన్యుడిపై పడుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. దీనికి పశ్చిమాసియా యుద్ధంతోపాటు అనేక కారణాలున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఇటీవల ఆర్బీఐ వేసిన అంచనాలు, ఈ ఏడాది సాధారణ వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, రూపాయి బలహీనపడటం వంటివి అన్నీ కలిపి ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. చమురు ధరలు పెరగడం కారణంగా ముడి సరుకు ధరలు పెరిగి, ఫలితంగా ఆహార తయారీ సంస్థలకు ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. అలాగే, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. దీనివల్ల కలిగే నష్టాన్ని కంపెనీలు వినియోగదారులపైకి మళ్లిస్తున్నా. ఆహారోత్పత్తులు, నిత్యావసరాల ధరలు పెంచుతున్నాయి. లేదా వస్తువుల పరిమాణం తగ్గిస్తున్నాయి. అన్నిరంగాలపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. ముఖ్యంగా ముడిసరుకుల ధరలు, రవాణా చార్జీలు పెరగడం సమస్యగా మారింది. ప్యాకేజింగ్ ఖర్చులు కూడా పెరిగాయి. ఇందుకు అవసరమైన ముడిసరుకులైన ప్లాస్టిక్ ర్యాపర్లు, అట్టలు వంటివి, ఇతర ఉత్పత్తులు కూడా విదేశాల నుంచి రావాలి. ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటికే అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. ఇండియాలో వరుసగా ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. అసలు ఎల్పీజీ సిలిండర్లు దొరకడమే కష్టమైపోయింది. వీటి ధరలు కూడా పెరుగుతుండటం కంపెనీలకు భారంగా మారింది. విదేశాల నుంచి రావాల్సిన అనేక సరుకుల రవాణా నిలిచిపోవడం పెద్ద సవాలుగా మారింది. వీటన్నింటినీ ముందుగా ఎదుర్కొనేందుకు సిద్ధమైనవి ఎఫ్‌ఎంసీజీ కంపెనీలే. హిందుస్తాన్ యునీలీవర్, గోద్రేజ్, డాబర్ ఇండియా వంటి కంపెనీలు ఇప్పటికే స్వల్పంగా తమ ఉత్పత్తుల ధరలు పెంచాయి. అలాగే బ్రిటానియా వంటి సంస్థలు తమ ఉత్పత్తుల బరువు, పరిమాణం తగ్గిస్తున్నాయి. రూ.10 నుంచి రూ.20 వరకు ఉండే వస్తువుల ధరలపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. వీటి ధరలు పెంచడం ఆయా కంపెనీలకు అంత లాభదాయకం కాదు. అందుకే ఉత్పత్తుల బరువు తగ్గించాలని చూస్తున్నాయి. దీన్ని ష్రింక్‌ఫ్లేషన్ అంటారని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ప్రస్తుత సంక్షోభం కారణంగా దేశంలో ఆటోమొబైల్ ఉత్పత్తులైన బైకులు, కార్లపై కూడా పడుతోంది. వాహనాల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. విమానాల ఫ్యుయెల్ ధరలు పెరగడంతో చాలా సంస్థలు విమాన సర్వీసుల్ని నిలిపివేశాయి. ఇదే సమయంలో కంపెనీలు తమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. సిబ్బందికి అనవసర ప్రయాణాల్ని నిలిపివేసింది.అలాగే, మార్కెటింగ్, అడ్వర్‌టైజింగ్ ఖర్చుల్ని కూడా కంపెనీలు తగ్గించుకుంటున్నాయి. కంపెనీలు పెరిగిన ఈ ఖర్చుల్ని తమ వినియోగదారులపైకి మళ్లిస్తున్నాయి. దీంతో సామాన్యుడు ఇబ్బందిపడుతున్నాడు.

# ఒడిదుడుకుల్లోనే పయనం!




దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం కూడా ఒడిదుడుకుల్లోనే పయనించవచ్చు. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టకపోవడం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. దీనికితోడు వర్షాభావ పరిస్థితులు, ఈ ఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను దేశ జీడీపీ 1.1 శాతం తగ్గి 6.6 శాతానికే పరిమితం కావచ్చున్న రిజర్వ్ బ్యాంక్ అంచనాలు కొనుగోళ్లను ఆటంకపర్చే వీలున్నది. అంతకుముందు వారంతో పోల్చితే గత వారం సెన్సెక్స్ 532.40 పాయింట్లు లేదా 0.71 శాతం కోల్పోయి 74,243.34 దగ్గర ఆగింది. నిఫ్టీ 181.05 పాయింట్లు లేదా 0.76 శాతం పడిపోయి 23,366.70 వద్ద నిలిచింది. ఈ క్రమంలో ఈ వారంలోనూ మదుపర్లు అమ్మకాలకు పెద్దపీట వేయవచ్చున్న అంచనాలు వినిపిస్తున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం కూడా ఒడిదుడుకుల్లోనే పయనించవచ్చు. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టకపోవడం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. దీనికితోడు వర్షాభావ పరిస్థితులు, ఈ ఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను దేశ జీడీపీ 1.1 శాతం తగ్గి 6.6 శాతానికే పరిమితం కావచ్చున్న రిజర్వ్ బ్యాంక్ అంచనాలు కొనుగోళ్లను ఆటంకపర్చే వీలున్నది. అయితే గత శుక్రవారం ఆర్బీఐ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం, విదేశీ పెట్టుబడులకు ఊతమిచ్చే నిర్ణయాలు రావడం, గత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ జీడీపీ 7.7 శాతానికి పెరుగడం వంటివి పెట్టుబడులకు దోహదం చేయవచ్చున్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. కరెన్సీ మార్కెట్‌లో రూపీ పెరిగితే.. బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లు ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కాగా, పశ్చిమాసియాలో సంక్షోభ పరిస్థితులు దిగజారిగితే క్రూడాయిల్ రేట్లు పరుగులు పెట్టే అవకాశాలున్నాయి. ఇది చమురు, సహజ వాయువు ఆధారిత రంగాల్లో అమ్మకాల ఒత్తిడికి దారితీయగలదు. అయితే అమెరికా-ఇరాన్ మధ్య శాంతి స్థాపనకు అడుగులు పడితే మార్కెట్లకు ఉత్సాహమే. తగ్గే ముడి చమురు ధరలు కలిసొస్తాయి. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, కరెన్సీ మార్కెట్‌లో రూపీ పెరిగితే.. బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లు ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కాగా, పశ్చిమాసియాలో సంక్షోభ పరిస్థితులు దిగజారిగితే క్రూడాయిల్ రేట్లు పరుగులు పెట్టే అవకాశాలున్నాయి. ఇది చమురు, సహజ వాయువు ఆధారిత రంగాల్లో అమ్మకాల ఒత్తిడికి దారితీయగలదు. అయితే అమెరికా-ఇరాన్ మధ్య శాంతి స్థాపనకు అడుగులు పడితే విదేశీ మదుపర్ల పెట్టుబడులు ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,100 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,600-23,800 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చనీ చెప్తున్నారు. గమనిక.. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# పుట్టిన అందరికీ కనీస అవసరాలుంటాయి

## ఆలోచింపజేసేలా వంద దేవుళ్లు ట్రైలర్



విజయ్ ఆంటోని బిచ్చగాడు డైరెక్టర్ శశి డైరెక్షన్‌లో నటిస్తోన్న చిత్రం 'వంద దేవుళ్లు'. తాజాగా మేకర్స్ ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ లోకంలో ప్రాణాలతో పుట్టిన అందరికీ కనీస అవసరాలుంటాయి. తినడం, నిద్రపోవడం, తోడు వెతుక్కోవడం అనే డైలాగ్‌తో షురూ అయింది ట్రైలర్. తెలుగు, తమిళంలో సూపనర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు విజయ్ ఆంటోని. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ బిచ్చగాడు డైరెక్టర్ శశి డైరెక్షన్‌లో నటిస్తోన్న చిత్రం 'వంద దేవుళ్లు'. తాజాగా మేకర్స్ ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ లోకంలో ప్రాణాలతో పుట్టిన అందరికీ కనీస అవసరాలుంటాయి. తినడం, నిద్రపోవడం, తోడు వెతుక్కోవడం అనే డైలాగ్‌తో షురూ అయింది ట్రైలర్. తర్వాత హీరోహీరోయిన్ల ప్రేమ సన్నివేశాలు, భార్యా భర్తల అనుబంధం, తల్లీ కొడుకుల అనుబంధం.. ఇలా ఫ్యామిలీ ఆడియెన్స్ కు కనెక్ట్ అయ్యే అన్ని ఎలిమెంట్స్‌తో సినిమాను తీసినట్టు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది. విజయ్ ఆంటోనీ సినిమాలంటే బలమైన సామాజిక సందేశం ఉంటుందని తెలిసిందే. ఈ సారి కూడా బాక్సాఫీస్ వద్ద తన సినిమాతో అందరినీ ఇంప్రెస్ చేయడం పక్కా అని ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. రైతు సమస్యల చుట్టూ తిరిగే కథాంశంతో రాబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెబుతున్నాయి. ఈ మూవీలో స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేస్తున్నారు.


## 'జంగా' మాస్ లుక్‌లో త్రిగుణ్




టాలెంటెడ్ యాక్టర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం జంగా. త్రిగుణ్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ జంగా మోషన్ పోస్టర్ లాంచ్ చేశారు. ఇప్పటివరకు లవర్ బాయ్‌లా కనిపించిన త్రిగుణ్ ఇందులో రా అండ్ రస్టిక్ లుక్‌లో ఊరమాస్‌గా కనిపించబోతున్నట్టు మోషన్ పోస్టర్ చెబుతోంది. తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ త్రిగుణ్. ఈ టాలెంటెడ్ యాక్టర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం జంగా. ఈ చిత్రానికి కెవిన్ (గడ్డం శ్రీహరి) కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వ వహిస్తున్నాడు. త్రిగుణ్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ జంగా మోషన్ పోస్టర్ లాంచ్ చేశారు. ఇప్పటివరకు లవర్ బాయ్‌లా కనిపించిన త్రిగుణ్ ఇందులో రా అండ్ రస్టిక్ లుక్‌లో ఊరమాస్‌గా కనిపించబోతున్నట్టు మోషన్ పోస్టర్ చెబుతోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రానికి కృష్ణ సౌరభ్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు రాయగా.. కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటలు రాస్తున్నారు. ఈ మూవీని వనిత కిలారి సమర్పణలో ఆర్‌కే ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్య కిలారి, జయ చంద్ర నాయుడు కిలారి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నేహా పఠాన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. వరలక్ష్మి శరత్‌కుమార్, శ్రావణ్, మధునందన్, గగన్ విహారి, సమీర్, రఘుకారుమంచి, రచ్చ రవి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## నాగచైతన్య వృషకర్మ క్రేజీ న్యూస్

**– భారీ మొత్తం పలికిన శాటిలైట్ రైట్స్..!**



కార్తీక్ దండు దర్శకత్వంలో అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ 'వృషకర్మ' . లక్కీ భాస్కర్ ఫేం మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. తండేల్ తర్వాత అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ 'వృషకర్మ' . ఈ మూవీకి విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నాడు. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లక్కీ భాస్కర్ ఫేం మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది..వార్తాపత్రిక చందా 2026 డిసెంబర్‌లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. వృషకర్మ శాటిలైట్‌రైట్స్‌ను పాపులర్ టీవీ ఛానల్ జీ తెలుగు దక్కించుకున్నట్టు సమాచారం. జీ తెలుగు భారీ మొత్తానికి వృషకర్మ శాటిలైట్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయనున్నారట మేకర్స్. వృషకర్మ లో 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనుండటంతో.. ఇంతకీ క్రేజీ యాక్టర్‌ను డైరెక్టర్ కార్తీక్ దండు ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై స్టార్ డైరెక్టర్ సుకుమార్ బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి.లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## గీతు మోహన్‌దాస్ యాక్షన్ అవతార్



యశ్ టాక్సిక్ బిటీఎస్ వీడియో అదిరిందంతే కన్నడ, తెలుగు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటి టాక్సిక్ ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ హీరో యశ్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. యశ్ 19వ చిత్రంగా వస్తోన్న టాక్సిక్‌కు పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న వారికి అదిరిపోయే వార్తను గ్లింప్స్ రూపంలో అందించారు మేకర్స్. గీతు మోహన్ దాస్‌కు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ డైరెక్టర్‌గా ఆమెలోని యాక్షన్ అవతార్‌ను ప్రేక్షకులకు చూపిస్తూ బిటీఎస్ వీడియోను షేర్ చేశారు. యశ్ అండ్ టీంపై వచ్చే స్టైలిస్ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎలా డిజైన్ చేసిందో బిటీఎస్‌వీడియో హింట్ ఇచ్చేస్తుంది. గీతు మోహన్ దాస్ సెట్స్‌లో యాక్షన్ సీన్లను వివరిస్తున్న తీరు టాక్సిక్‌లో యశ్‌లోని నయా స్టైలిష్ అవతార్‌ను చూపించబోతున్నట్టు అర్థమవుతోంది. కన్నడ, తెలుగు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటి టాక్సిక్. ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ హీరో యశ్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. యశ్ 19వ చిత్రంగా వస్తోన్న టాక్సిక్‌కు పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. టాక్సిక్‌లో యశ్‌లోని నయా స్టైలిష్ అవతార్‌ను చూపించబోతున్నట్టు అర్థమవుతోంది. కన్నడ, తెలుగు పాన్ ఇండియా సినిమా అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న వారికి అదిరిపోయే వార్తను గ్లింప్స్ రూపంలో అందించారు మేకర్స్. మొత్తానికి గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేయాలని గట్టిగానే ఫిక్సయినట్టు తాజా వీడియో చెబుతోంది. కన్నడ స్టార్ హీరో యశ్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. యశ్ 19వ చిత్రంగా వస్తోన్న టాక్సిక్‌కు పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. టాక్సిక్‌లో ఈ మూవీని కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై వెంకట్ కే నారాయణ తెరకెక్కిస్తున్నారు. లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.టాక్సిక్ చిత్రంలో బాలీవుడ్ భామలు హ్యూమా ఖురేషి, టారా సుటారియా కీ రోల్స్‌లో నటిస్తుండగా.. అక్షయ్ ఒబెరాయ్ మరో కీలక పాత్ర పోషిస్తున్నాడు. కేజీఎఫ్ ప్రాంచైజీ తర్వాత యశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## ఆగస్టు 7న 'కొరియన్ కనకరాజు'

**– వరుణ్ తేజ్ మూవీపై ఆసక్తి పెంచుతున్న కొత్త అప్‌డేట్స్!**



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'పై ప్రేక్షకుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే విడుదలైన టీజర్, ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని 2026 ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఈ రిలీజ్ డేట్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'పై ప్రేక్షకుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే విడుదలైన టీజర్, ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంగీత సంచలనం ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు సంగీత ప్రియులను ఆకట్టుకోవడంతో సినిమా ఆల్బమ్‌పై కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి.' అంతేకాకుండా జూన్ మూడో వారంలో ఈ చిత్రానికి సంబంధించిన మరో ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌నే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో వరుణ్ తేజ్ కొరియన్ భాషలో "నేను తిరిగొచ్చేశా" అంటూ చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో కథలో కొరియన్ భాషకు, కొరియా నేపథ్యానికి ఉన్న సంబంధం ఏమిటనే ప్రశ్న అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించగా, కొత్త గ్లింప్స్‌తో సినిమాపై మరింత ఆసక్తి పెంచాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన యువ నటి రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజా తరం ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా కామెడీ, యాక్షన్, ఎమోషన్ అంశాల సమ్మేళనంగా సినిమా రూపొందుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449